క్లుప్తంగా

తలసేమియా బాధితుల కోసం రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న యువకులతో నెరెడ్కో ప్రతినిధులు

ఎంవీపీ కాలనీ: నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్(నెరెడ్కో) విశాఖ నార్త్ జోన్ ఆధ్వర్యంలో పెదవాల్తేర్‌లోని రెడ్‌క్రాస్ సొసైటీ కార్యాలయంలో ఆదివారం ఉచిత రక్తదాన శిబిరం నిర్వహించారు. తలసేమియా వ్యాధితో బాధపడుతున్న పిల్లల సహాయార్థం ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని నెరెడ్కో రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.శ్రీనగేష్, నార్త్ జోన్ అధ్యక్షుడు ఎ.రమేష్ బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనేక మంది యువత రక్తదానం చేసేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ వై.శివనాగేంద్రరెడ్డి, కార్యదర్శి రవికుమార్, కె.విష్ణువర్ధన్‌రెడ్డి, మురళి, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి



బీచ్‌రోడ్డులో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న రవాణా శాఖ సిబ్బంది

బీచ్ రోడ్డు: ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు పాటు పడాలంటూ రవాణా శాఖ సిబ్బంది ఆదివారం బీచ్ రోడ్డులో ప్లకార్డులు ప్రదర్శించారు. మిషనల్ లైఫ్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆర్కేబీచ్ వద్ద రవాణా శాఖ సిబ్బంది పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. సిగ్నల్ పాయింట్ల వద్ద వాహనాల ఇంజిన్‌ను ఆపడం ద్వారా పర్యావరణాన్ని కాపాడడంతో పాటు ఇంధనం కూడా ఆదా చేసుకోవచ్చనని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టీవో వేణుగోపాలరావు, మోటారు వాహనాల తనిఖీ అధికారులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



పాత నేరస్తులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ద్వారకా సీఐ సింహాద్రినాయుడు

సీతమ్మధార : ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు కేసుల్లో ఉన్న రౌడీషీటర్లకు సీఐ సింహాద్రినాయుడు కౌన్సెలింగ్ నిర్వహించారు. రౌడీషీటర్ల ఎలా మెలుగుతున్నారని తెలుసుకున్నారు. కొట్లాటలు, తగాదాల్లో తలదూర్చితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వారిపై ఎల్లప్పుడూ నిఘా ఉంటుందని తెలిపారు. కౌన్సెలింగ్ అనంతరం వారిని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ కార్యక్రమంలో పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజల్లో భాగంగా హరేకృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణ, సుభద్ర, బలభద్ర, జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి వారి లీలలు, మహిమలు వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపన చేశారు.

స్వయం ఉపాధికి భరోసా

- జన శిక్షణా సంస్థాన్ ఆధ్వర్యంలో మహిళలకు వివిధ కోర్సుల్లో శిక్షణ
- తొలిసారిగా ట్రాన్స్‌జండర్స్‌కు బ్యూటీషియన్ కోర్సు



కంప్యూటర్ శిక్షణ పొందుతున్న యువత



టైలరింగ్ శిక్షణలో మహిళలు

మద్దిలపాలెం: మహిళల స్వయం ఉపాధికి కేరాఫ్ అడ్రస్‌గా జన శిక్షణా సంస్థాన్ నిలుస్తోంది. వారి ఆర్థిక ప్రగతికి భరోసా ఇస్తోంది. స్వల్పకాలపు కోర్సుల్లో శిక్షణ ఇస్తూ ఉపాధి బాటలు వేస్తోంది. నిష్ణాతులైన బోధకులతో శిక్షణ ఇస్తుండడంతో నగర మహిళల నుంచి అపూర్వ ఆదరణ లభిస్తోంది. ప్రస్తుతం జన శిక్షణా సంస్థాన్‌లో అందిస్తున్న కోర్సుల వివరాలు, ఉపాధి అవకాశాల గురించి తెలుసుకుందాం.

- భారత ప్రభుత్వ నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 1984లో పీతాపురం కాలనీలో జన శిక్షణా సంస్థాన్ ఏర్పాటైంది. రాష్ట్రంలో 6 జనశిక్షణా సంస్థాన్‌లు ఉన్నాయి. 15 నుంచి 45 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న నిరుద్యోగ యువతీ, యువకులు, గృహిణులకు వృత్తి విద్యలో ఉచిత శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

మొత్తం 4 వేల మందికి శిక్షణ

జన శిక్షణా సంస్థాన్ ఏర్పాటు చేసిన నాటి నుంచి ఇప్పటి వరకూ 4 వేల మందికి వృత్తి, ఉపాధి కోర్సుల్లో శిక్షణ ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ 4.0 యోజన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం అనకాపల్లిలో 30 మందికి, మల్కాపురంలో 30 మందికి, తాటిచెట్లపాలెంలో 30 మందికి, జనశిక్షణా సంస్థాన్‌లో 30 మందికి వివిధ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నారు.

- రాష్ట్రంలో తొలిసారిగా విశాఖ జన శిక్షణా సంస్థాన్‌లో ట్రాన్స్‌జెండర్స్ స్వయం ఉపాధి సాధించడానికి వీలుగా బ్యూటీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు.
- టైలరింగ్, బ్యూటీషియన్, జ్యూట్, కంప్యూటర్, ఫ్యాబ్రిక్, ఎలక్ట్రికల్, హ్యాండ్ ఎంబ్రాయిడరీ, టెక్స్ టైల్స్, ప్రింటింగ్, ఫ్రూట్ జ్యూస్ తయారీలో శిక్షణ ఇస్తున్నారు.

2022-23 సంవత్సరంలో 1800 మందికి శిక్షణ

జన శిక్షణా సంస్థాన్‌లో 2022-23 సంవత్సరంలో 1800 మందికి వివిధ కోర్సుల్లో శిక్షణ ఇచ్చాం. మరో 900 మంది శిక్షణ పూర్తి చేయనున్నారు. సీఎస్ఆర్ ద్వారా రోటరీ వారి ఆర్థిక సహాయంతో 260 మందికి టైలరింగ్‌లో శిక్షణ ఇచ్చి, కుట్టు మెషిన్లు పంపిణీ చేశాం. 2022-23కు కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ అవార్డు స్వీకరించాం.

– సిహెచ్.అప్పలనాయుడు, జన శిక్షణా సంస్థాన్ డైరెక్టర్

బ్యూటీషియన్‌గా నెలకు రూ.10 వేలు ఆదాయం



జన శిక్షణా సంస్థాన్‌లో ఉచితంగా బ్యూటీషియన్ కోర్సులో శిక్షణ పొందాను. ఇప్పుడు స్వయం ఉపాధిలో భాగంగా నెలకు బ్యూటీషియన్‌గా పని చేస్తూ రూ.10వేలు సంపాదిస్తున్నాను. మా కుటుంబానికి ఆర్థిక తోడ్పాటు అందిస్తున్నాను.

– రాణి బేగం, బ్యూటీషియన్

శిక్షణతో ఆర్థిక తోడ్పాటు



టైలరింగ్‌లో శిక్షణ పొందాను. ఆర్థిక తోడ్పాటుకు ఎంతో దోహదపడింది. స్వయంగా సంపాదించగలనే ధైర్యాన్ని ఇచ్చింది. టైలరింగ్ షాప్ పెట్టుకుని స్వయం ఉపాధికి బాటలు వేసుకున్నాను.

– గేదెల లక్ష్మి, టైలర్

కంప్యూటర్ కోర్సుతో ప్రైవేట్ ఉద్యోగం



జన శిక్షణా సంస్థాన్‌లో కంప్యూటర్ కోర్సు నేర్చుకున్నాను. ఓ ప్రైవేట్ కంపెనీలో అకౌంట్స్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్నాను. చక్కని శిక్షణతో తనలో ధైర్యాన్ని నింపి, ఉద్యోగం అవకాశం కల్పించారు.

– కె. అనిత, ప్రైవేట్ ఉద్యోగి

గ్రామ దేవతల పండగకు ఆహ్వానం

ఎంవీపీ కాలనీ: ఇసుకతోట గ్రామ దేవతలు కనకదుర్గమాంబ, నెల్లి పోలమాంబ, ఎర్నిమాంబ అమ్మవార్ల వార్షిక పండగ వచ్చే నెల 11వ తేదీ నుంచి ప్రారంభం కానుంది. ఈ మేరకు పండగకు కుటుంబ సమేతంగా హాజరు కావాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు అక్కరమాని వెంకటరావుకు ఎంవీపీ కాలనీలోని పార్టీ కార్యాలయంలో గ్రామ కమిటీ ప్రతినిధులతో కలిసి పార్టీ రాష్ట్ర అదనపు కార్యదర్శి మొల్లి అప్పారావు ఆహ్వాన పత్రిక అందజేశారు. 12న తొల్లేళ్ల సంబరం, ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు, 13న అమ్మవార్లకు అభిషేకాలు, అనుపు కార్యక్రమాలు నిర్వహిస్తామని అప్పారావు తెలిపారు.



వెంకటరావుకు ఆహ్వాన పత్రిక అందిస్తున్న మొల్లి అప్పారావు

ఈ కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షుడు చొల్లంగి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మద్దిలపాలెం : ఏపీ ఈపీడీసీఎల్ జోన్–1లో జేఆర్ నగర్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా మంగవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని జోన్–1 ఈఈ సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఇసుకతోట మెయిన్, లాసన్స్ టవర్ నుంచి వాసుదేవ ఫంక్షన్ వరకూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని పేర్కొన్నారు.

బాలుడు అదృశ్యం



మద్రిపాలెం:ం: కంచరపాలెం పరిధిలో ఓ బాలుడు అదృశ్యమైన ఘటన చోటు చేసుకుంది. కంచరపాలెం 5వ పట్టణ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మీసాల తేజ (15) తల్లిదండ్రులతో కలిసి గొల్ల కంచరపాలెంలో నివసిస్తున్నాడు. ఈ నెల 24 ఉదయం 7.30 గంటలకు ఇంట్లో నుంచి బయటికి వెళ్ళి తిరిగి రాలేదు. తల్లిదండ్రులు, బంధువులు ఎంత వెతికినా ఫలితం లేకపోవడంతో తండ్రి మీసాల శ్రీనివాసరావు ఆదివారం కంరచపాలెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ ఎస్ విజయ్ కుమార్ నేతృత్వంలో ఏఎస్ఐ రాజారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాలిటెక్నిక్ ప్రవేశాలకు సర్వం సిద్ధం

- నేటి నుంచి కౌన్సెలింగ్

మురళీనగర్: పాలిటెక్నిక్ కాలేజీల్లో ప్రవేశాలకు సంబంధించి సర్వం సిద్ధంగా ఉన్నట్లు కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగు కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ, ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కేడీవీ నరసింహారావు తెలిపారు. సోమవారం నుంచి ప్రారంభమయ్యే కౌన్సెలింగులో భాగంగా విద్యార్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రతి రోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుందన్నారు. ఇందుకు సంబంధించి సిబ్బందిని నియమించినట్లు చెప్పారు.



పాలిటెక్నిక్ విద్యార్థులు

ఇవి తీసుకురావాలి

సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు ప్రాసెసింగు ఫీజు రసీదుతో పాటు పాలిసెట్ హాల్ టికెట్, ర్యాంకు కార్డు, ఎస్ఎస్‌సీ మార్కుల మెమో (ఒరిజినల్ లేదా ఇంటర్‌నెట్ కాపీ), 4–10 తరగతుల వరకు స్టడీ సర్టిఫికెట్ లేదా రెసిడెన్స్ సర్టిఫికెట్, ఈడబ్ల్యుఎస్ సర్టిఫికెట్ (ఓసీ అభ్యర్థులకు), 01.01.2020 నాడు లేదా తర్వాత జారీ చేసిన ఆదాయ ధ్రువపత్రం, కులధృవీకరణ పత్రం, టీసీ, ప్రత్యేక కేటగిరీ విద్యార్థులు వారికి సంబంధించిన సర్టిఫికెట్లు తీసుకు రావాల్సి ఉంటుంది.

ఉత్సాహంగా పర్యావరణ సైకిల్ ర్యాలీ

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో ఆదివారం పర్యావరణ సైకిల్ ర్యాలీ ఉత్సాహంగా జరిగింది. జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్టీల్‌ప్లాంట్ పర్యావరణ విభాగం ఆధ్వర్యంలో ఉక్కునగరం త్రిష్నా మైదానంలో ఏర్పాటు చేసిన సైకిల్ ర్యాలీని స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్(పర్సనల్) ఎస్.సి. పాండే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అన్నారు. ఈ ర్యాలీ ఉక్కునగరంలోని పలు సెక్టార్ల మీదుగా తిరిగి త్రిష్నా మైదానానికి చేరుకుంది. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి ఫణికుమార్, డాక్టర్ చెన్నా కిషోర్, స్పోర్ట్స్ ఇన్‌చార్జి సీజీఎం డాక్టర్ కె.హెచ్. ప్రకాశ్, పర్యావరణ విభాగం ఉద్యోగులు ప్రవీణ్ కుమార్, రామకృష్ణ, బాపిరాజు, శ్రీనివాస్, ఎం.పెంటారావు, కొండబాబు పాల్గొన్నారు.



ఉక్కు త్రిష్నా మైదానంలో సైకిల్ ర్యాలీ ప్రారంభిస్తున్న డైరెక్టర్ పాండే

నిరంతర వైద్య విద్యతో చక్కటి నైపుణ్యం

మహారాణిపేట : నిరంతర వైద్య విద్యా కార్యక్రమాలను తరచూ నిర్వహించడం ద్వారా ఆధునిక పద్ధతులు తెలుసుకోవడానికి వీలు కలుగుతుందని ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు తెలిపారు. కేజీహెచ్ ప్రసూతి విభాగం, వైఎస్సార్ హెల్త్ యూనివర్శిటీ సంయుక్త నిర్వహణలో ఆదివారం నిరంతర వైద్య విద్యా కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ బుచ్చిరాజు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ప్రసూతి వైద్యంలో అధునాతన పద్ధతులు వస్తున్నాయని, వాటిపై ప్రతి ప్రసూతి పీజీకి అవగాహన ఉండాలని ఆయన అన్నారు. కేజీహెచ్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ రాధాకృష్ణ మాట్లాడుతూ శాఖల వారీగా సీఎంఈ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రసూతి వైద్యానికి చెందిన పలు అంశాలపై జరిగిన చర్చాగోష్టిలో ప్రొఫెసర్లు కేవీఎస్ సంధ్యాదేవి, డాక్టర్ ఆర్.గీతావందన, డాక్టర్ అల్లు పద్మజ, డాక్టర్ కె.శ్యామలాదేవి, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

రాజ్యాంగానికి కేంద్రం తూట్లు

కూర్మన్నపాలెం: ప్రపంచంలోనే మహోన్నతమైన భారత రాజ్యాంగానికి తూట్లు పొడుస్తూ, ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టాలని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చూస్తోందని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుడు నీరుకొండ రామచంద్రరావు విమర్శించారు. ఈ మేరకు కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న 836వ రోజు ఉక్కు దీక్షలో ఐఎన్‌టీయూసీ కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొని విశాఖ ఉక్కు–ఆంధ్రుల హక్కు అంటూ కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వరంగంలో కొనసాగించే వరకు కార్మికుల ఉద్యమం ఆగదన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించేలా చర్యలు తీసుకోవాలన్నారు.



దీక్షలో మాట్లాడుతున్న నీరుకొండ రామచంద్రరావు

శివప్రసాద్‌రెడ్డిపై ఫిర్యాదు

బీచ్‌రోడ్డు: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని అగౌరవపరుస్తూ సిరిపురం సర్కిల్‌లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన జనసేన నాయకుడు శివప్రసాద్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ 28వ వార్డు యువజన విభాగం అధ్యక్షుడు బి.భవానిశంకర్ మూడో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశారు. దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి, మాజీ ఎంపీ వివేకానందరెడ్డి మృతిని కించపరిచేలా ఫ్లెక్సీలను ఏర్పాటు చేయడంపై విచారణ చేపట్టి కఠినంగా శిక్షించాలని కోరారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు




ఉత్సవమూర్తులు ఊరేగిస్తున్న భక్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి 8గంటల వరకు స్వర్ణ పుష్పార్చన ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అలంకరించి కల్యాణమండపంలోని వేదికపై అధిష్ఠంపజేశారు. 108 స్వర్ణ సంపెంగ పుష్పాలతో స్వామికి అష్టోత్తర శతనామావళి నిర్వహించి విశేషంగా హారతులు ఇచ్చారు.

వైభవంగా నిత్యకల్యాణం

నృసింహస్వామికి నిత్య కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్ఠంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు.

ఆకట్టుకుంటున్న సాయిబాబా విగ్రహం



చినగదిలిలో ఏర్పాటు చేసిన ఊపిరి పీల్చే సాయిబాబా విగ్రహం

ఆరిలోవ: చినగదిలి నార్త్ షిర్డీ సాయిబాబా ఆలయంలో మరో సాయిబాబా విగ్రహాన్ని తాత్కాలికంగా ఏర్పాటు చేశారు. ఊపిరి పీల్చుతూ వదులుతున్నట్లు ఉన్న ఈ విగ్రహాన్ని రవిచంద్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో తయారు చేశారు. దీన్ని ఆదివారం ఇక్కడి ఆలయంలో భక్తులు దర్శనం కోసం ఉంచారు. ఊపిరి పీల్చి వదులుతున్నట్టు, ఎడమ చేతి మధ్య వేలు కదపడం, నవ్వుతున్నట్టు ఉన్న ఈ సాయిబాబా విగ్రహం భక్తులను ఆకట్టుకుంటోంది. నాలుగు నెలల క్రితం కూడా రవిచంద్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో మాట్లాడే షిర్డీ సాయిబాబా విగ్రహాన్ని ఇక్కడ ఏర్పాటు చేసి కొద్ది రోజుల అనంతరం దాన్ని చింతపల్లికి తీసుకెళ్లిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఏర్పాటు చేసిన విగ్రహాన్ని నెల రోజుల పాటు ఇక్కడ సందర్శకుల దర్శనం కోసం ఉంచనున్నట్టు రవిచంద్ ఆర్ట్స్ నిర్వాహకుడు రవిచంద్ తెలిపారు. సుమారు ఐదున్నర అడుగుల ఎత్తు ఉండే ఈ విగ్రహాన్ని రూ.8 లక్షలు ఖర్చుతో మూడు నెలల పాటు శ్రమించి తయారు చేసినట్లు తెలిపారు.

కళ్లకు కట్టిన ‘ఘంటసాల జీవితం’



ఘంటసాల నాటకంలో ఓ సన్నివేశం



ఎన్టీఆర్ పాత్రధారికి హార్మోనియం నేర్పిస్తున్న దృశ్యం

మద్దిలపాలెం: అమర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు జీవితంలో ముఖ్య ఘట్టాలతో రూపొందించిన నాటకాన్ని కళాకారులు కళ్లకు కట్టినట్టు ప్రదర్శించారు. రంగసాయి నాటకం సంఘం వ్యవస్థాపకుడు బాదంగీర్ సాయి ఆధ్వర్యంలో ఆదివారం మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో ఈ నాటక ప్రదర్శనను మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, రైటర్స్ అకాడమీ చైర్మన్ వి.వి.రమణమూర్తి, సురపనేని విజయకుమార్, ఏయూ పూర్వ రిజిస్ట్రార్ వెలగపూడి ఉమామహేశ్వరరావు ప్రారంభించారు. స్టేషన్‌ఘన్‌పూర్‌కు చెందిన శ్రీసాయి సంతోషి నాట్య మండలి సురభి కళాకారులు ప్రదర్శించిన ఈ నాటకంలో ప్రధానంగా ఘంటసాల వెంకటేశ్వరరావు తొలినాళ్లలో సంగీతం నేర్చుకునే క్రమంలో పడిన కష్టాలను చూపించారు. అనంతరం విజయనగరం సంగీత కళాశాలకు చేరిన తీరుతో పాటు ఆయన వివాహం గురించి చక్కగా సన్నివేశాలు రూపొందించారు. అనంతరం మద్రాసు వెళ్లిన ఘంటసాల అక్కడ సంగీత దర్శకుడుగా, గాయకుడుగా ఎదిగిన తీరును నాటకంలో చూపించిన తీరు అద్భుతం. అదే క్రమంలో క్విట్ ఇండియా ఉద్యమంలో ఘంటసాల పాల్గొన్ని జైలుపాలు అయ్యే సన్నివేశాన్ని కూడా ప్రదర్శించి ఆకట్టుకున్నారు. తర్వాత మద్రాసులో పొట్టి శ్రీరాములు ఆమరణ దీక్ష చేస్తూ చనిపోయిన సన్నివేశంలో ఘంటసాల ప్రత్యేక ఆంధ్ర ఉద్యమంలో భాగస్వాములు ఎలా అయ్యేరో కథలో మమేకం చేశారు. అనంతరం ఓ చిత్రంలో హార్మోనియం వాయించే సీన్ కోసం ఎన్టీఆర్.. ఘంటసాల ఇంటికి వెళ్లి హార్మోనియం నేర్చుకున్న సన్నివేశాన్ని చక్కటి పాటతో మేళవించి ప్రదర్శించారు.

ప్రత్యేక ఆకర్షణగా బాలనటులు

నాటకంలో బాల నటీనటులు లవకుశలో పాటలను ఆలపించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. సురభి చిన్నారులు హిమంసు సంతోషి, జాహ్నవిలను ప్రేక్షకులు అభినందించారు.

గూడు లేని పక్షులు.. గోడు వినేదెవరు?



ఖడ్గమృగం ఎన్‌క్లోజరులో ఫెలికాన్ పక్షుల సందడి

ఆరిలోవ: ఇందిరాగాంధీ జూ పార్కులో ఫెలికాన్ పక్షులకు గూడు కరువైంది. దీంతో వేరే జంతువుల ఎన్‌క్లోజర్లలో గుంపులుగా వాలుతూ కాలం గడిపేస్తున్నాయి. గూడు చెదిరినా జూ పార్కును విడిచిపెట్టడంలేదు. వాటికి ఉన్న అనుబంధమో ఏమోగాని జూని విడిచి బయటకు వెళ్లలేకపోతున్నాయి. జూ పార్కే తమ ప్రపంచం అంటూ గడిపేస్తున్నాయి. గతంలో ప్రత్యేక ఎన్‌క్లోజర్లలో ఉంటూ సందడి చేస్తే ఫెలికాన్ పక్షులు ఇప్పుడు జూలో ఉన్న అన్ని ఎన్‌క్లోజర్లలో రోజుకో చోట కనిపిస్తున్నాయి. ఈ పక్షులు ఏళ్ల తరబడి జూలో ఉన్నాయి. వాటికి పెద్ద పులులు ఎన్‌క్లోజరు ఎదురుగా అప్పట్లో జూ అధికారులు రెండు గూళ్లు నిర్మించారు. జూకి వెళ్లే సందర్శకులు ఆ గూళ్ల వద్ద వాటిని చూసి సంబరపడేవారు. ఎత్తయిన, విశాలమైన ఆ గూళ్లు 2014 అక్టోబరులో వచ్చిన హుద్‌హుద్ తుపాన్ ధాటికి కూలిపోయి శిథిలమైపోయాయి. దీంతో ఆ గూళ్లలో ఉండే ఫెలికాన్ పక్షులు కొన్ని మృత్యువాతపడ్డాయి. మిగిలినవి చెల్లాచెదురైపోయాయి. తుపాన్ ధాటికి గూళ్ల నుంచి బయటపడిన ఆ పక్షులు ఎక్కడికి ఎగిరిపోయాయో కొద్ది రోజులు వరకు జూ అధికారులు, సిబ్బందికి సైతం తెలియలేదు. ఆ తరువాత వారంలో అవన్నీ మళ్లీ జూలో చెట్లపైనే అక్కడక్కడా కనిపించాయి. మరికొద్ది రోజులు తర్వాత అన్నీ ఓకేచోటకు చేరి గుంపులుగా తిరుగుతూ రాత్రులు ఒకే చెట్టుపై చేరుతున్నాయి. ఆహారం కోసం జూలో ఖడ్గమృగం, ఏనుగులు, కోతుల ఎన్‌క్లోజర్లలో వాలుతున్నాయి. చెట్లపైన చిన్న గూడుకట్టుకొని గుడ్లు పెట్టి సంతతిని పెంచుకుంటున్నాయి. జూ లోపల అధికారులు వన్యప్రాణుల కోసం కొత్త ఎన్‌క్లోజర్లు నిర్మిస్తున్నారు. మరికొన్ని ఎన్‌క్లోజర్లకు మరమ్మతులు చేపడుతున్నారు. తమకు కూడా ఓ ఎన్‌క్లోజరు ప్రత్యేకంగా నిర్మించండి మహాప్రభో అన్నట్లు అధికారులు వైపు ఈ పక్షులు దీనంగా చూస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు ఫెలికాన్ పక్షుల కోసం గూడు నిర్మించే దిశగా ఆలోచన చేస్తే బాగుంటుందని సందర్శకులు కోరుతున్నారు.

తూర్పు కాపు నూతన జేఏసీ ఏర్పాటు

సీతమ్మధార : తూర్పు కాపు కులాన్ని చిన్నచూపు చూస్తున్న రాజకీయ పార్టీలకు తగిన గుణపాఠం చెప్పి తీరుతామని ఆలిండియా తూర్పు కాపు సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు పిసిని చంద్రమోహన్ హెచ్చరించారు. ఆశీలమెట్టలో జరిగిన రాష్ట్ర తూర్పు కాపు జాయింట్ యాక్షన్ కమిటీ ఆవిర్భావ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్నేళ్లుగా తూర్పు కాపు రిజర్వేషన్ల సాధనకు పలుమార్లు ప్రభుత్వాలకు మొరపెట్టుకున్నా నేటికీ పరిష్కారం కాకపోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ నేపథ్యంలో 36 మందితో తూర్పు కాపు జేఏసీ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర జేసీ చైర్మన్‌గా గిరగా అప్పలస్వామి, కో చైర్మన్‌గా అన్నెపు రామకృష్ణ నాయుడు, గౌరవ చైర్మన్‌గా పైలా శ్రీనివాసరావు, వర్కింగ్ చైర్మన్లుగా బబ్బాది ఫకీర్‌నాయుడు, పతివాడ కష్ణవేణి, చీఫ్ సెక్రటరీలుగా రాయి శ్రీనుబాబు, ఈ.శ్రీనివాసరావు, కె.అచ్చెంనాయుడు, ఎం.గురునాయుడు, కోశాధికారిగా బెల్లాన సంతోష్‌కుమార్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు ఆకుల అప్పల సూరినాయుడు, ప్రధాన కార్యదర్శి పాలవలస యశస్విని, యువజన విభాగం రాష్ట్ర సహాధ్యక్షుడు శ్రీనుబాబు, రాష్ట్ర మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు భైపతి జయలక్ష్మి, విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దింటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



సంఘీభావం తెలుపుతున్న తూర్పు కాపు జేఏసీ నాయకులు